సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

శనివారం : 29 : జూన్ : 2024



వరద ముప్పు తప్పేదెన్నడో..?

వర్షం, వరద వస్తే మొర్రేడువాగు ఒడ్డు ఇళ్లు కూలిపోతున్నాయి. దీంతో స్థానికులు నిత్యం ఆందోళన చెందుతున్నారు. 8లో



కేసీఆర్ హయాంలోనే..

సీతారామ ప్రాజెక్ట్ కేసీఆర్ హయాంలోనే పూర్తయిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అన్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
32° / 26°

వాతావరణం

జిల్లాలో శనివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అమ్మవారికి పంచామృతాభిషేకం



పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి శుక్రవారం వైభవంగా పంచామృతాభిషేకం జరిపారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి)ఆలయంలో అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేకం, పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం పూజలతోపాటు కుంకుమ పూజ, గణపతిహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎన్.రజనీకుమారి, భక్తులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళా 1వ తేదీకి వాయిదా

సూపర్‌బజార్(కొత్తగూడెం)/కొత్తగూడెంటౌన్: జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం క్లబ్‌లో ఈ నెల 29న నిర్వహించ తలపెట్టిన మెగా జాబ్‌మేళా అనివార్య కారణాలతో జూలై ఒకటో తేదీకి వాయిదా వేసినట్లు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా యువజన, క్రీడల శాఖ నేతృత్వంలో జరిగే జాబ్‌మేళాలో పాల్గొనేవారు https://forms.gle/aWH1uo5poS6RrT3D6 ద్వారా రిజిస్టర్ చేసుకోవచ్చని లేదా నేరుగా పాల్గొనవచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా పది బయోడేటా ఫారాలు తీసుకు రావాలన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల వయస్సువారు అర్హులని, ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు వివరించారు.

సంస్థ అభివృద్ధికి కృషి చేయాలి

ఆర్టీసీ ఆర్‌ఎం సరిరాం



డిపోలో మొక్క నాటుతున్న ఆర్‌ఎం సరిరాం

మణుగూరు టౌన్: కార్మికులు సంస్థ పురోభివృద్ధికి పాటుపడాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఎ.సరిరాం సూచించారు. శుక్రవారం ఆయన మణుగూరు డిపోను సందర్శించారు. డిపోలో అన్ని విభాగాల పనితీరును పరిశీలించారు. అనంతరం కార్మికులతో ఏర్పాటు చేసిన గేట్ సమావేశంలో మాట్లాడారు. అనంతరం డిపో ఆవరణలో మొక్క నాటారు. కాగా ఆర్‌ఎంను డిపో మేనేజర్ స్వామి శాలువాతో ఘనంగా సన్మానించారు. సూపరింటెండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేటి నుంచి రైతు భరోసాపై సలహాలు స్వీకరణ

చుంచుపల్లి: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో శనివారం నుంచి ప్రత్యేక మహాజన సభలను నిర్వహిస్తున్నట్లు జిల్లా సహకార అధికారి సయ్యద్ ఖుర్షీద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు భరోసా పథకం అమలులో రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలపై రైతుల నుంచి సూచనలు, సలహాలు తీసుకునేందుకు వారం రోజులపాటు ఈ సభలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రైల్వే స్థలం ఇస్తేనే..

న్యూగొల్లగూడెం రోడ్డులో ట్రాఫిక్ సమస్యలకు చెక్

- రోడ్డు విస్తరణకు ప్రణాళిక రూపొందించిన మున్సిపాలిటీ
- ప్రజాప్రతినిధులు దృష్టి సారిస్తేనే పరిష్కారం



రద్దీగా మారిన న్యూ గొల్లగూడెం రోడ్డు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ నుంచి ఇల్లెందు –కొత్తగూడెం ప్రధాన రహదారిని కలిపే న్యూగొల్లగూడెం రోడ్డుపై తరచూ ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. దీంతో రోడ్డు విస్తరణకు మున్సిపాలిటీ ప్రణాళిక రూపొందించింది. అయితే రైల్వే స్థలాల సేకరణ అడ్డంకిగా మారింది.

న్యూగొల్లగూడెం రోడ్డు జిల్లాలో ప్రధాన రైల్వే స్టేషన్‌గా ఉన్న భద్రాచలంరోడ్ (కొత్తగూడెం) నుంచి పెద్ద బజార్, న్యూగొల్లగూడెం, ఎదురుగడ్డ, కారుకొండ రామవరం మీదుగా టేకులపల్లి మండలం బొమ్మనపల్లి దగ్గర ఇల్లెందు రోడ్డుకు కలుస్తుంది. సుమారు ఏడు కిలోమీటర్ల నిడివితో ఉన్న ఈ రోడ్డు దశాబ్దకాలంగా కొత్తగూడేనికి అనధికారిక బైపాస్‌గా ఉపయోగంలో ఉంది. జిల్లా కేంద్రంలో ప్రధాన మార్కెట్‌గా పేరున్న చిన్నబజార్, పెద్ద బజార్‌లతోపాటు ట్రాన్స్‌పోర్టు సేవలకు సంబంధించిన గోదాంలు ఈ మార్గంలోనే ఉన్నాయి. దీంతో టూవీలర్లు, ఆటోలతో పాటు ట్రక్కులు, లారీలు ఈ మార్గంలో ఎక్కువగానే తిరుగుతుంటాయి.

ట్రాఫిక్ చిక్కులు..

రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ మార్గంలో తరచుగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఈ సమయంలో ఒకేసారి రెండు ఆటోలు లేదా రెండు కార్లు ఎదురెదురుగా వచ్చినా రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. దీనికి తోడు ఓ వైపు రైల్వేస్టేషన్, మరోవైపు ఆటోలు, బస్సులు ఆగే సూపర్ బజార్ సర్కిల్ ఉండటంతో ఏదైనా రైలు స్టేషన్‌కు వచ్చినప్పుడు ఈ ట్రాఫిక్ సమస్య మరింతగా పెరుగుతోంది. ఇరుకు రహదారి కారణంగా నేతాజీ వ్యాయామశాల నుంచి సూపర్ బజార్ సర్కిల్ వరకు ఉన్న రోడ్డు బాటిల్ నెక్‌లా మారడంతో ట్రాఫిక్ సమస్య ఈ మార్గంలో ప్రయాణించే వారిని తీవ్ర ఇక్కట్లకు గురిచేస్తోంది.

చిక్కుముడి..

ట్రాఫిక్ చిక్కులకు కేంద్రంగా ఉన్న రైల్వేస్టేషన్ ప్రాంగణం దగ్గర రోడ్డు విస్తరణపై సందిగ్ధత నెలకొంది. ఇక్కడ రోడ్డు ఐదు మీటర్లుగా ఉంది. రోడ్డును విస్తరించాలంటే సూపర్ బజార్ నుంచి కొత్త 3వ టౌన్ పోలీస్ స్టేషన్ వరకు రైల్వే పరిధిలో ఉన్న స్థలంలో ఆరు మీటర్ల వరకు స్థలం అవసరం పడుతుంది. ఈ మేరకు రైల్వే అధికారులతో మున్సిపాలిటీతోపాటు జిల్లా అధికారులు చర్చలు జరిపారు. అయితే రోడ్డు విస్తరణకు రైల్వే స్థలాలు అప్పగించాలంటే దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ స్థాయిలో అనుమతులు రావాల్సి ఉంది. దీంతో ఈ మార్గంలో ట్రాఫిక్ చిక్కులు పూర్తి స్థాయిలో తొలగిపోవాలంటే జిల్లా అధికారులతోపాటు స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు రైల్వేశాఖతో సంప్రదింపులు జరిపి సానుకూల నిర్ణయం వచ్చేలా చూడాల్సిన అవసరం ఉంది. లేదంటే పెద్దబజార్ – సూపర్ బజార్ బాటిల్ నెక్ కారణంగా రోడ్డు విస్తరణ జరిగినా ట్రాఫిక్ సమస్య సమసిపోదు.

విస్తరణకు నిధులు..

ఇల్లెందుకు దగ్గరి దారి కావడంతో క్రమంగా సూపర్ బజార్ – కారుకొండ – బొమ్మనపల్లి మార్గం ఇల్లెందు బైపాస్ రోడ్డుగా మారింది. దీంతో న్యూ గొల్లగూడెం నుంచి – సూపర్ బజార్ వరకు ఉన్న 1.5 కిలోమీటర్ల మార్గాన్ని డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్‌తో విస్తరించడంతోపాటు అధునాతన లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు రూ. 3 కోట్ల వ్యయంతో పనులకు టెండర్లు పిలిచారు. నేడో రేపో పనులు ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ రోడ్డు కొన్ని చోట్ల కనిష్ఠంగా ఐదు మీటర్ల వెడల్పుతో ఉండగా కొన్ని చోట్ల గరిష్ఠంగా ఏడు మీటర్ల వెడల్పుతో ఉంది. ఈ మొత్తం మార్గాన్ని 10 మీటర్ల వెడల్పుతో విస్తరించాలని నిర్ణయించారు.

‘ఆయిల్‌పామ్’ విస్తరణకు కృషి



పవర్ ప్లాంట్ వివరాలు తెలుసుకుంటున్న మంత్రి తుమ్మల, ఆయిల్‌ఫెడ్ ఎండీ యాస్మిన్, ఎమ్మెల్యే జారే

- రాష్ట్రంలో పది లక్షల ఎకరాలకు సాగు పెంచాలనేదే లక్ష్యం
- అశ్వారావుపేటలో హార్టికల్చర్ కళాశాలకు ప్రతిపాదన
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



అప్పారావుపేట ఫ్యాక్టరీలో యంత్రాలను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల తదితరులు

అశ్వారావుపేటరూరల్/దమ్మపేట: తెలంగాణను ఆయిల్‌పామ్ హబ్‌గా అభివృద్ధి చేసి దేశంలోనే ఆదర్శంగా నిలిపేలా కృషి చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్, ఆయిల్‌ఫెడ్ ఎండీ యాస్మిన్ బాషా, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి శుక్రవారం ఆయన అశ్వారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీ ఆవరణలో నిర్మిస్తున్న పవర్ ప్లాంట్‌ను సందర్శించారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఆయిల్‌పాం పంట సాగు 11 లక్షల ఎకరాల్లో సాగవుతుండగా, అత్యధికంగా ఏపీలో 5 లక్షల ఎకరాల్లో, తెలంగాణలో రెండు లక్షల ఎకరాల్లో సాగులో ఉందని తెలిపారు. వచ్చే ఐదేళ్లలో తెలంగాణలో పది లక్షల ఎకరాలకు సాగు పెంచాలనే లక్ష్యంతో ఉన్నామని చెప్పారు. దేశంలో 100 లక్షల టన్నుల పామాయిల్ డిమాండ్ ఉంటే, 3.96లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తే జరుగుతోందని తెలిపారు. ఈనేపథ్యాన ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు నష్టమనేదే ఉండదన్నారు. కాగా, ఆయిల్‌పామ్ మొక్కలు పొడవుగా పెరగడం వల్ల ఇబ్బందులు వస్తున్నందున హైబ్రీడ్, పొట్టి రకాల విత్తనాలపై ఆయిల్‌ఫెడ్ అధికారులు దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు.

టన్ను ధర రూ.15వేలు ఉండాల్సిందే..

ఆయిల్‌పామ్ గెలల టన్నుకు కనీస మద్దతు ధర రూ.15వేల వరకు ఉంటే రైతులకు లాభాలు వస్తాయని మంత్రి తుమ్మల చెప్పారు. ఈ విషయాన్ని కేంద్రం తీసుకెళ్లామని, త్వరలోనే ఏపీ వ్యవసాయ మంత్రితో కలిసి కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తామని తెలిపారు. ఆయిల్‌పామ్ టన్ను ధర నిర్ణయాన్ని దమ్మపేట మండలం అప్పారావుపేట ఫ్యాక్టరీ ఓఆర్ ఆధారంగా ప్రకటించాలని కేంద్రాన్ని కోరినట్లు చెప్పారు. అలాగే పామాయిల్ తోటల్లో విద్యుత్ లైన్లతో ఇబ్బందులు వస్తున్నందున మార్చుకునేందుకు చార్జీలు మినహాయించాలని విద్యుత్‌శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. కాగా, అశ్వారావుపేట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ఆవరణలో సుమారు రూ.30 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 2.5 మెగా పవర్ ప్లాంట్‌ను జూలై చివరి నాటికి సిద్ధం చేయాలన్నారు.

మరో ప్రపంచంలోకి వచ్చినట్లు ఉంది!

అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో పర్యటిస్తే మరో ప్రపంచంలోకి వచ్చినట్లుగా ఉందని డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్, ఆయిల్‌ఫెడ్ ఎండీ యాస్మిన్ బాషా తెలిపారు. మంత్రి తుమ్మలతో కలిసి ఆయిల్‌పామ్ తోటలు, ఫ్యాక్టరీలను పరిశీలించిన ఆమె మాట్లాడుతూ పామాయిల్, ఉద్యాన తోటలతో ఆహ్లాదకరమైన వాతావరణం ఉందని చెప్పారు. ఇక్కడ ఉద్యాన కళాశాలను ఏర్పాటుకు, వ్యవసాయ కళాశాలలో పీజీ కోర్సు కూడా ప్రారంభానికి కృషి చేస్తానని తెలిపారు. అధికారులు సుధాకర్‌రెడ్డి, ఆకుల బాలకృష్ణ, నాగబాబు, ఆయిల్‌ఫెడ్ డైరెక్టర్ ఎ.రామచంద్రప్రసాద్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

కలెక్టర్ జితేష్ వి.పాటిల్



పంప్‌హౌస్ వద్ద పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్, అధికారులు

అశ్వాపురం: సీతారామ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పెండింగ్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ పేర్కొన్నారు. మండల పరిధిలోని బీజీకొత్తూరు గ్రామంలో ఉన్న సీతారామ ప్రాజెక్ట్ పంప్‌హౌస్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. పంప్‌హౌస్‌లో మోటర్లు నీరు ఎత్తిపోసే ప్రాంతాన్ని పరిశీలించారు. మ్యాప్‌ల ద్వారా జలవనరుల శాఖ అధికారులు సీతారామ ప్రాజెక్ట్ ప్రారంభం నుంచి చివరి వరకు పంప్‌హౌస్‌లు, కెనాల్, సాగయ్యే ఆయకట్టు, పూర్తయిన పనులు, మిగిలి ఉన్న పనులపై వివరించారు. సీతారామ ప్రాజెక్ట్ పూర్తయితే ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు మహబూబాబాద్ జిల్లాలో 6.70 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు పెండింగ్‌లో ఉన్న పనులు వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముత్తినేని సుజాత, ఎస్‌ఈ శ్రీనివాసరెడ్డి, ఈఈ వెంకటేశ్వరరావు, ఏఈ రమేష్, అధికారులు పాల్గొన్నారు.

టెన్త్ సప్లిమెంటరీలో 49.36 శాతం ఉత్తీర్ణత

బాలికల కంటే మెరుగైన ఫలితాలు సాధించిన బాలురు

కొత్తగూడెంఅర్బన్: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. ఈ నెల 3 నుంచి 13వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించగా, జిల్లాలో 1,406 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 694 మంది ఉత్తీర్ణులుకాగా, 49.36 శాతం ఉత్తీర్ణత నమోదైందని జిల్లా విద్యాధికారి ఎం.వెంకటేశ్వరాచారి తెలిపారు. ఇందులో బాలురు 49.65 శాతం, బాలికలు 48.92 శాతం ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. రీకౌంటింగ్‌కు జూలై 8వ తేదీ వరకు గడువు ఉందని, సబ్జెక్ట్‌కు రూ.500 చొప్పున చెల్లించి దరఖాస్తును నేరుగా డీజీఈకి పంపవచ్చని డీఈఓ తెలిపారు. రీ వెరిఫికేషన్‌కు సబ్జెక్టుకు రూ.1000 చొప్పున ఎస్‌బీఐ బ్యాంకులో చలానా తీసి ధ్రువపత్రాలతో జూలై 8వ తేదీ వరకు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలన్నారు. రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ వివరాలకు ప్రధానోపాధ్యాయులు, ఏసీజీఈ ఎస్.మాధవరావును 99890 27943 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు చేయించుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి

పాల్వంచరూరల్: సికిల్ సెల్ అనీమియా లక్షణాలు ఉంటే సమీపంలోని ఆరోగ్య కేంద్రాల్లో వైద్య పరీక్షలు చేయించుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి వి.చంద్రమౌళి సూచించారు. మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. వర్షాకాలంలో ప్రభావంచూపే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రక్తహీనత, విపరీతమైన నొప్పి, చేతులకు, కాళ్లకు వాపులు రావడం ఇన్‌ఫెక్షన్ వంటి లక్షణాలు తరుచు కనిపిస్తే వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఎం.ఉషారాణి, ఎంపీఓ బి.నారాయణ, కార్యదర్శులు సాయిరాం, రాంబాబు, మౌనిక, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

అన్నపురెడ్డిపల్లి: వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల విషయంలో వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్ ఆదేశించారు. శుక్రవారం మండలంలోని ఎర్రగుంట పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. పీహెచ్‌సీలో అందిస్తున్న వైద్యసేవల వివరాలను మండల వైద్యాధికారిణి ప్రియాంకను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న డ్రైడేఫ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించి, సిబ్బందికి సూచనలిచ్చారు.

33 కేవీ స్విచ్ స్టేషన్ షురూ



స్టేషన్‌ను ప్రారంభిస్తున్న జీఎం రాంచందర్

మణుగూరుటౌన్: మణుగూరు ఏరియా పీవీ కాలనీ బంగ్లాస్ ఏరియాలో నూతనంగా నిర్మించిన 33 కేవీ స్విచ్ స్టేషన్‌ను శుక్రవారం ఏరియా జీఎం దుర్గం రాంచందర్ ప్రారంభించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, నర్సిరెడ్డి, వీరభద్రరావు, రమేశ్, మదన్‌నాయక్, అనురాధ, రాంబాబు, వీరభద్రుడు, రాజేశ్వరరావు, శేషగిరిరావు, మధుసూదన్, శోభన్‌బాబు, మేకల ఈశ్వర్, వై.కృష్ణంరాజు, కృష్ణమూర్తి తదితరులున్నారు.

విద్యారంగంలో పనిచేయడం అదృష్టం

అశ్వారావుపేటరూరల్: విద్యారంగంలో పని చేయడం ఎంతో అదృష్టమని డీఐఈఓ సులోచనారాణి అన్నారు. అశ్వారావుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సాగర్ ఈ నెల 30వ తేదీన ఉద్యోగ విరమణ చేయనుండగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆమె హాజరై ప్రసంగించారు. తొలుత ఆమె సాగర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో యూఎస్ ప్రకాష్‌రావు, అధ్యాపకులు ఎస్‌కే చాంద్‌పాషా, అశోక్‌బాబు, డి.శ్రీనివాస్, నరసింహారావు, రాంబాబు, అంజయ్య, మారేశ్, సురేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

క్వార్టర్ల వివరాలు నమోదు చేయాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణివ్యాప్తంగా క్వార్టర్ల వివరాలను శాప్‌లో అప్‌లోడ్ చేయాలని జీఎం పర్సనల్ (ఐఆర్‌పీఎం అండ్ ఆర్సీ) బీఆర్. దీక్షితులు సూచించారు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం నుంచి ఆయన వివిధ ఏరియాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. క్వార్టర్ల స్థితిగతులను పరిశీలించడమే కాక, ఎవరు ఉంటున్నారనే వివరాలు నమోదు చేయాలని తెలిపారు. అలాగే, రిటైర్డ్ ఉద్యోగుల సీఎంపీఎఫ్ క్లెయిమ్‌లు త్వరగా పూర్తి చేయాలని, ప్రతీ ఉద్యోగి, వారి డిపెండెంట్ల ఫొటోలను పోర్టల్‌లో పొందుపర్చాలని, అండర్‌గ్రౌండ్ నుంచి ఉపరితల గనుల్లో పనిచేసేందుకు అందిన దరఖాస్తులను పరిశీలించాలని సూచించారు. వీసీలో అధికారులు విలాస్ శ్రీనివాస్ పోద్దార్, వెంకటేశ్వరరావు, కె.అజయ్‌కుమార్, వైవీఎల్ వరప్రసాద్, ముకుంద సత్యనారాయణ, అనిల్, కె.ప్రవీణ్, కె.శివకుమార్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

అశ్వారావుపేటరూరల్: నిషేధిత గుట్కా ప్యాకెట్లను విక్రయిస్తున్న ఓ దుకాణంపై శుక్రవారం పోలీసులు దాడి చేశారు. ఎస్‌ఐ శ్రీను కథనం ప్రకారం.. మండలంలోని వినాయకపురానికి చెందిన గరికపాటి నాగరాజు తన కిరాణ దుకాణంలో గుట్కా ప్యాకెట్లను విక్రయిస్తున్నట్లు తెలియడంతో తనిఖీ చేసి, రూ.5,390 విలువైన గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నాగరాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పాల్వంచ: అక్రమంగా నిల్వ ఉంచిన గుట్కా ప్యాకెట్లను పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. పట్టణ పరిధిలోని గట్టాయిగూడెంనకు చెందిన కాసుల చంద్రశేఖర్(వంశీ) తన కిరాణా షాపులో గుట్కాలు అమ్ముతున్నట్లు సమాచారం అందటంతో ఎస్‌ఐ రాము తనిఖీ చేశారు. రూ.96,304 విలువ చేసే గుట్కా ప్యాకెట్లను సీజ్ చేసి, చంద్రశేఖర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వాహనాలకు వేలం పాట

కొత్తగూడెంరూరల్: జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో సీజ్ చేసిన వాహనాలకు పోలీస్ హెడ్ క్వార్టర్లలో శుక్రవారం వేలంపాట నిర్వహించారు. మొత్తం 323 వాహనాలకు వేలం పాట నిర్వహించగా రూ.15,04,000 వచ్చాయని ఎంటీఓ సుధాకర్ తెలిపారు. కాగా, ఎస్పీ రోహిత్‌రాజు, డీఎస్పీలు మల్లయ్యస్వామి, రెహమాన్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, అడ్మిన్ ఆర్‌ఐ లాల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

కొత్తగూడెంటౌన్: పాత కొత్తగూడెంలోని శ్మశానవాటికలో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని సీఐ కరుణాకర్ శుక్రవారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.10 వేల నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

వరద ముప్పు తప్పేదెన్నడో..?

- వరద ఉధృతికి కూలుతున్న మొర్రేడువాగు ఒడ్డు ఇళ్లు
- వర్షం వస్తే భయంతో గడుపుతున్న స్థానికులు
- గేబియన్ వాల్ నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితం



వరదలతో కోతకు గురైన మొర్రేడువాగు ఒడ్డున ఉన్న ఇళ్లు

కొత్తగూడెంరూరల్: వర్షం, వరద వస్తే వారి ఇళ్లు ముంపునకు గురవుతాయి. పలువురి ఇళ్లు కూలిపోతున్నాయి. 2005 సంవత్సరం నుంచి అక్కడి ప్రజలు ఏటా వర్షాకాలంలో భయం గుప్పిట్లో కాలం వెళ్లదీస్తున్నారు. జిల్లా కేంద్రంలోని లక్ష్మీదేవిపల్లి మండలం మొర్రేడు వాగుకు ఎడమ వైపున ఉన్న ఉపేందర్‌కాలనీ, సంజయ్‌నగర్, చాతకొండ ప్రజల దుస్థితి ఇది. వర్షాకాలంలో మొర్రేడు వరద ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది. ఇప్పటికే పదుల సంఖ్యలో ఇళ్లు కూలిపోయాయి. బాధిత కుటుంబాలు ఆర్థికంగా నష్టపోయాయి. అయినా బాధితులకు పరిహారం ఇవ్వడం లేదు. మరో చోట స్థలం కూడా కేటాయించడం లేదు. ఎమ్మెల్యేలకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదని బాధితులు పేర్కొంటున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో అప్పటి ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు చొరవతో మొర్రేడువాగు ఎడమ వైపున గేబియన్ వాల్ నిర్మాణానికి రూ.35 కోట్ల నిధులు మంజూరయ్యాయి. 2023 అక్టోబర్‌లో అప్పటి రవాణా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పనులకు శంకుస్థాపన చేశారు. కానీ పనులు ప్రారంభం కాలేదు. డిజైనింగ్ మార్పు తదితర కారణాల పేరిట తీవ్ర జాప్యం జరుగుతోంది. ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగా, స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, నిధులు మంజూరు చేయాలని కోరారు. వాల్ నిర్మాణం కాకపోవడంతో ప్రస్తుత వర్షాకాలం సైతం ఆ ప్రాంతాల్లోవరద ముంపు తప్పని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రజలు భయం భయంగా గడుపుతున్నారు. మొర్రేడువాగులో పెద్ద పెద్ద రాళ్లను జేసీబీలతో తీసి ఉపేందర్ కాలనీ వైపు వేసినా కొంతమేరకు వరద ముప్పు తప్పేది. కానీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదు.

వరదలతో ప్రాణభయం



ప్రతి యేటా వచ్చే వర్షాలకు ఇళ్లు కూలుతున్నాయి. రాత్రి వేళలో వరద వస్తే మా ప్రాణాలకే ముప్పు. ప్రజాప్రతినిధులు మారుతున్నారుకానీ మొర్రేడు వాగు ఒడ్డున ఉన్నవారిని ఎవరూ పట్టించుకోవటంలేదు.

– జి.గౌతమ్

భయంతోనే బతుకుతున్నాం



ఏళ్ల నుంచి మొర్రేడు ఒడ్డున ఇళ్లలో ఉంటున్నాం. కొన్ని ఇళ్లు వరద కోతకు కూలిపోయాయి. వారు ఇతర ప్రాంతాలకు వెళ్లారు. వర్షాకాలం వచ్చిందంటే చాలు భయంతోనే బతకాల్సిందే. మాకు వేరే చోట స్థలాలు చూపాలి.

– కడెం లక్ష్మి

ప్రతిపాదనలు పంపించాం

మొర్రేడువాగు ఎడమ వైపు గేబియన్ వాల్ నిర్మాణానికి రూ.35 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. కిలోమీటరున్నర పొడవున గోడ నిర్మించేలా ప్రభుత్వానికి ప్రతిపాదించాం. త్వరలో నిధులు మంజూరవుతాయి. ప్రభుత్వం నుంచి నిధులు రాగానే నిర్మాణం చేపడతాం.

– రాంబాబు, నీటి పారుదల శాఖ డివిజనల్ ఇంజనీర్

వర్షంతో బొగ్గు ఉత్పత్తికి విఘాతం



జేవీఆర్ ఓసీలో వర్షంతో నిలిచిన వాహనాలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణివ్యాప్తంగా గురువారం రాత్రి, శుక్రవారం కురిసిన వర్షం కారణంగా సుమారు 60 వేల టన్నుల ఉత్పత్తికి విఘాతం ఏర్పడింది. సింగరేణి వ్యాప్తంగా ఉన్న 22 భూగర్భగనులు, 18 ఓసీల్లో రోజుకు 2.15 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 1.55 లక్షల టన్నుల ఉత్పత్తి మాత్రమే నమోదైంది. కొత్తగూడెం ఏరియాలో 45 వేల టన్నులకు 32 వేల టన్నులు, ఇల్లెందులో 11 వేల టన్నులకు 8 వేల టన్నులు, మణుగూరు ఏరియాలో 44 వేల టన్నులకు 34 వేల టన్నులు ఉత్పత్తి సాధించారు. దీంతో అధికారులు క్వారీల్లో భారీ వాహనాలను నడిపించాలని నిర్ణయించగా, క్వారీల్లో చేరిన వర్షం నీటిని ప్లాన్‌టూన్ పంప్‌ల ద్వారా తొలగించడంలో నిమగ్నమయ్యారు.

వృద్ధురాలిని కాపాడిన బ్లూకోల్ట్స్



నది నుంచి వృద్ధురాలిని తీసుకొస్తున్న పోలీసులు

భద్రాచలంటౌన్: భద్రాచలం గోదావరిలో దూకి ఆత్మహత్యాయత్నం చేసిన వృద్ధురాలిని పట్టణ బ్లూకోల్ట్స్ పోలీసులు రక్షించారు. ఎస్‌ఐ విజయలక్ష్మి కథనం ప్రకారం.. కొత్తగూడెం రామవరానికి చెందిన భారతి కొంతకాలంగా కడుపునొప్పితో ఇబ్బంది పడుతోంది. తన పిల్లలను ఇబ్బంది పెట్టకూడదనే భావనతో ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుని శుక్రవారం భద్రాచలం చేరుకుని గోదావరిలో దూకింది. స్థానికులు చూసి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో బ్లూకోల్ట్స్ సభ్యులు సురేంద్ర, జంపయ్య ఘటనా స్థలానికి చేరుకుని వృద్ధురాలిని కాపాడి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చామని, కౌన్సెలింగ్ ఇచ్చి భారతిని అప్పగిస్తామని ఎస్‌ఐ తెలిపారు.

బైక్‌ల దొంగ అరెస్ట్



బైక్‌లు, నిందితుడిని చూపుతున్న పోలీసులు

కొత్తగూడెంటౌన్: పట్టణంలో పలుచోట్ల ద్విచక్ర వాహనాలు అపహరించిన నిందితుడు సల్లా చంద్రశేఖర్‌ను కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ కరుణాకర్ వివరాలు వెల్లడించారు. కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లో ఎస్‌ఐ విజయ వాహన తనిఖీలు చేస్తుండగా ద్విచక్ర వాహనంపై వస్తున్న వ్యక్తి పారిపోవడానికి ప్రయత్నించగా పట్టుకుని విచవారించారు. గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన, ప్రస్తుతం చుంచుపల్లి మండలం హౌసింగ్‌బోర్డు కాలనీలో ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్న సల్లా చంద్రశేఖర్ అని తేలింది. కొత్తగూడెం బస్టాండ్ సమీపంలో గతంలో మూడు ద్విచక్ర వాహనాలను చోరీ చేసినట్లు అంగీకరించాడని, నిందితుడిని రిమాండ్‌కు తరలించామని సీఐ వివరించారు. సమావేశంలో ఎస్‌ఐ విజయ, హెడ్‌కానిస్టేబుల్ ఘని, కానిస్టేబుళ్లు సురేశ్, వీరన్న, నరేశ్, ప్రసాద్ పాల్గొన్నారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా వాల్‌పోస్టర్లు

కొత్తగూడెంటౌన్/కరకగూడెం/ఇల్లెందురూరల్: మావోయిస్టుల కు వ్యతిరేకంగా శుక్రవారం జిల్లా కేంద్రంతో పాటు కరకగూడెం, గుండాల, ఇల్లెందు మండలాల్లో వాల్‌పోస్టర్లు వెలిశాయి. గుండాల మండలంలో దామెరతోగు, చిన్న వెంకటాపురం సాయన్నపల్లి, గణపురం, కరకగూడెం మండలంలోని మోతె ఎర్ర చెరువు వద్ద, ఇల్లెందు మండలంలోని మర్రిగూడెం గ్రామంలోనేగాక కొత్తగూడెం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఈ పోస్టర్లను అంటించారు. అందులో హింసాత్మక ఘటనల్లో గాయపడిన బాధితుల ఫొటోలు ముద్రించగా, మావోయిస్టుల స్వార్థ ప్రయోజనాల కోసం పేదలను బలి చేస్తున్నారని, నిజనిర్ధారణ పేరుతో హడావుడి చేసే ప్రజా సంఘాలు, మహిళా సంఘాలు బాధ్యులు.. ఇలాంటి విషయాల్లో నోరు మెదపక పోవడం బాధాకరమని పేర్కొన్నారు.

చింతగుప్ప పాఠశాలలో విచారణ

దుమ్ముగూడెం: మండలంలోని చింతగుప్ప పాఠశాలలో శుక్రవారం దుమ్ముగూడెం మండల నోడల్ ఆఫీసర్ ఏవీ రామారావు, పర్ణశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఏజే ప్రభాకర్ విచారణ చేపట్టారు. చింతగుప్ప పాఠశాల ఉపాధ్యాయుడు ఆదే పాఠశాలలో చదువుతున్న తుర్రం అభిషేక్‌ను అకారణంగా కొడుతున్నాడని విద్యార్థి తండ్రి రాజు మండల విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేశాడు. దీనిపై స్పందించిన ఎంఈఓ విచారణ చేపట్టాలని ఆదేశించారు. విచారణ చేపట్టిన అధికారులు నివేదికను అధికారులకు అందజేస్తామని చెప్పారు.

ఈపీ ఆపరేటర్ల పోస్టులు పెంచిన యాజమాన్యం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ ఇటీవల 68 ఈపీ ఆపరేటర్ ట్రెయినీ (ఇంటర్నల్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే పోస్టులను మరో 32 పెంచుతూ శుక్రవారం సర్క్యులర్ విడుదల చేసినట్లు జీఎం (పర్సనల్) బీఆర్ దీక్షితులు తెలిపారు. అంతేకాక ఎంపికైన అభ్యర్థులు కచ్చితంగా ఐదేళ్ల పాటు మణుగూరు ఏరియాలో పనిచేసేలా నిబంధన పొందుపర్చామని పేర్కొన్నారు. ఇప్పటికే అభ్యర్థులకు డ్రైవింగ్ పరీక్ష నిర్వహించగా, ఎంపికైన 800 మందికి ఈ నెల 30న సింగరేణి ఉమెన్స్ కళాశాలలో రాత పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేరోజు తుదిజాబితా వెల్లడిస్తామని, అనంతరం ప్రతిభతో పాటు రిజర్వేషన్ ఆధారంగా పోస్టులు భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు.

రేపు స్తంభాద్రి మల్టీ, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభం

ఖమ్మంవైద్యవిభాగం: వైద్యులే యాజమాన్యంగా ఏర్పాటు చేసిన స్తంభాద్రి మల్టీ, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఆదివారం ప్రారంభిస్తున్నట్లు యాజమాన్య బాధ్యులు ఒక ప్రకటనలో వెల్లడించారు. న్యూరో, ట్రామాకేర్, ఆర్థోపెడిక్, హార్ట్, యూరాలజీ, క్రిటికల్ కేర్ విభాగాల్లో అత్యాధునిక వైద్య సదుపాయాలతో ఆస్పత్రిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఉదయం జరిగే ప్రారంభోత్సవానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీలు రామసహాయం రఘురాంరెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాలతి, ఐఎంఏ ప్రతినిధులు హాజరవుతారని వెల్లడించారు. వివిధ విభాగాల వైద్యులు గట్టినేని సురేశ్, మేదరమెట్ల అనిల్‌కుమార్, గుమ్మడి రాఘవేంద్ర, డోగిపర్తి కృష్ణసుమంత్, మేర్ల హర్షతేజ, చావా సృజన, నవ్య శ్రీలలిత, డోగిపర్తి యష్మిత ఆస్పత్రిలో వైద్యసేవలు అందిస్తారని తెలిపారు.

పీడీకి మెమో జారీ

జూలూరుపాడు: విద్యార్థినిని కొట్టిన ఫిజికల్ డైరెక్టర్ (పీడీ) అరుణకుమారికి మెమో జారీ చేసినట్లు జూలూరుపాడు హైస్కూల్ లక్ష్మీనర్సయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీడీని వివరణ కోరుతూ మెమో ఇచ్చామని, ఆమె సంజాయిషీ ఇచ్చారని పేర్కొన్నారు. డీఈఓ వెంకటేశ్వరచారి ఆదేశంతో ఎంఈఓ వెంకట్.. పీడీని డీఈఓ కార్యాలయానికి తరలించారని హెచ్‌ఎం వివరించారు.

తహసీల్‌లో చోరీకి యత్నం

బూర్గంపాడు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలోని ఇన్వర్టర్ బ్యాటరీలు, కొన్ని పత్రాలను గురువారం రాత్రి కొందరు దుండగులు చోరీకి చేసేందుకు విఫలయత్నం చేశారు. 8 బ్యాటరీలను బస్తాలో వేసుకుని, అవి కనిపించకుండా వాటిపైనే తహసీల్‌లోని పత్రాలను కప్పి బయటకు వస్తున్న వారిని స్థానికులు వెంబడించారు. దీంతో వారు బ్యాటరీలు, పత్రాలను పడేసి పరారయ్యారు. స్థానికులు వారిని పట్టుకునేందుకు ప్రయత్నించినా దొరకలేదు. వారు రోడ్ల వెంట చిత్తు పేపర్లు సేకరించే వారని స్థానికులు చెబుతున్నారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి బ్యాటరీలు, పత్రాలను తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి అప్పగించారు. ఈ విషయమై డీటీ రాంనరేశ్‌ను వివరణ కోరగా చోరీ జరిగింది వాస్తవమేనని, స్థానికులు వెంబడించడంతో దుండగులు పరారయ్యారని తెలిపారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

పాల్వంచ: ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని రాంనగర్‌కు చెందిన రహీమద్దీన్ సతీమణి ఎండీ సహీంసుల్తానాబేగం (37) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. మనస్తాపానికి గురైన ఆమె ఈ నెల 24వ తేదీన ఇంట్లో ఉరివేసుకుంది. గుర్తించిన భర్త ఆమెను కొత్తగూడెంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. మృతురాలి సోదరుడు యాకూబ్‌పాషా ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరకట్న వేధింపుల కేసులో ఆరు నెలల జైలు

కొత్తగూడెంటౌన్: వరకట్నం కోసం వేధించిన, రుద్రంపూర్‌కు చెందిన కాలం సుధాకర్‌రావుకు ఆరు నెలల జైలుశిక్షతో పాటు రూ.5 వేలు జరిమానా విధిస్తూ శుక్రవారం కొత్తగూడెం మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ వి.శివనాయక్ తీర్పు చెప్పారు. పాల్వంచకు చెందిన చైతన్యతో రుద్రంపూర్‌కు చెందిన కాలం సుధాకర్‌రావుకు 2023లో వివాహమైంది. పెళ్లి సమయంలో కట్నంగా రూ.లక్షన్నరతో పాటు అర తులం బంగారం, ఒక ద్విచక్ర వాహనం, ఆడబిడ్డ కట్నం కింద రూ.25 వేలు, కొంత సామగ్రి అందించారు. నెల వరకు దంపతులు బాగానే ఉన్న తర్వాత అదనపు కట్నం కోసం భర్త, అత్త లక్ష్మీకాంతమ్మ, ఆడబిడ్డ మారె పద్మ.. అదనపు కట్నం కోసం వేధింపులు మొదలుపెట్టారు. వేధింపులు తీవ్రం కావడంతో చైతన్య పాల్వంచ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్‌ఐ పి.సత్యనారాయణరెడ్డి కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. అరుగురు సాక్షులను విచారించిన జడ్జి కాలం సుధాకర్‌పై నేరం రుజువుకావడంతో పైవిధంగా తీర్పు చెప్పారు. అత్త లక్ష్మీకాంతమ్మ, ఆడబిడ్డ మోరె పద్మపై నేరం రుజువుకాకపోవడంతో కేసు కొట్టివేశారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ లావణ్య, లైజన్ ఆఫీసర్ ఎస్.వీరబాబు, పి.బాబు సహకరించారు.

బైక్ సీటు కింద పాము!



సీటుపైకి వచ్చిన పాము

ములకలపల్లి: బైక్ సీటు కిందకు పాము దూరింది. మండల కేంద్రంలో రోడ్డు పక్కన ఓ ప్రభుత్వ ఉద్యోగి తన ద్విచక్ర వాహనాన్ని నిలిపాడు. పని ముగించుకొని బైక్ వద్దకు వస్తుండగా సీటు కింది నుంచి మెల్లగా పాము బయటకు రావడం గమనించాడు. స్థానికులు వచ్చి దానిని వానకోయిల (విషరహితం)గా గుర్తించారు. తర్వాత పాము కిందకు దిగి రోడ్డు పక్కకు వెళ్లిపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

స్వర్ణకవచధారణలో రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామివారి దేవస్థానం అంతరాలయంలోని మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్య కల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శుక్రవారం సందర్భంగా శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

కేసీఆర్ హయాంలోనే 'సీతారామ' పనులు పూర్తి

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు



పంప్‌హౌస్ వద్ద కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రేగా, రాజేందర్, నాయకులు

అశ్వాపురం: సీతారామ ప్రాజెక్ట్‌కు కేసీఆర్ శంకుస్థాపన చేయడమే కాక సరిపడా నిధులు కేటాయించి పూర్తి చేస్తే, కాంగ్రెస్ నేతలు వారి ఘనతగా ప్రచారం చేసుకుంటున్నారని పినపాక మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఎద్దేవా చేశారు. అశ్వాపురం మండలం బీజీ కొత్తూరులో సీతారామ ప్రాజెక్ట్ పంప్‌హౌస్ వద్ద శుక్రవారం రేగా ఆధ్వర్యాన బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు గోదావరి జలాలకు ప్రత్యేక పూజలు చేయడంతో పాటు కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం కాంతారావు మాట్లాడుతూ.. 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు రూ.17 వేల కోట్ల అంచనాతో 2016 ఫిబ్రవరి 16న సీతారామ ప్రాజెక్ట్‌కు కేసీఆర్ శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు మహబూబాబాద్ జిల్లాకు సాగునీరు అందించేందుకు పంప్‌హౌస్‌లు, కెనాల్ పనులు పూర్తి చేసి ట్రయల్ రన్ చేపట్టే సమయాన అసెంబ్లీ ఎన్నికల కోడ్‌తో పనులు నిలిచిపోయాయని, ఆ సమయాన కాంగ్రెస్ నాయకులు కేసులు వేసి ప్రాజెక్టును అడ్డుకోవాలని యత్నించినా కేసీఆర్ ఉక్కు సంకల్పం ముందు ఫలించలేదని తెలిపారు. అదే పార్టీ నేతలు ఇప్పుడు ట్రయల్ రన్ పేరుతో హడావుడి చేస్తూ ఘనత తమదేనని ప్రచారం చేసుకుంటున్నారన్నారు. పినపాక నియోజకవర్గంలోని అశ్వాపురం మండలానికే కాక అశ్వారావుపేట, కొత్తగూడెం, ఇల్లెందు తదితర నియోజకవర్గాల రైతులకు నీరు ఇవ్వకుండా మధిర, పాలేరుకు నీరు తరలిస్తున్నారని విమర్శించారు. ఇకనైనా అశ్వాపురం మండలానికి నీరు ఇవ్వకపోతే అడ్డుకుంటామని, తక్షణమే మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సూదిరెడ్డి సులక్షణ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగల రాజేందర్, నాయకులు కొల్లు మల్లారెడ్డి, కోడి అమరేందర్, మర్రి మల్లారెడ్డి, ఎన్నా అశోక్‌కుమార్, ఈదర సత్యనారాయణ, వట్టం రాంబాబు, కుర్రి నాగేశ్వరరావు, అప్పారావు, గద్దల రామకృష్ణ, జలగం జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన సామగ్రి సరఫరా చేయాలి

- ఐటీడీఏ పీఓ బి.రాహుల్
- ఐఐటీల్లో సీట్లు సాధించిన విద్యార్థులకు సన్మానం



ఐఐటీల్లో సీట్లు సాధించిన గిరిజన విద్యార్థులతో పీఓ రాహుల్, అధికారులు

భద్రాచలం: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలు, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్లకు నాణ్యమైన వంట సరుకులు, సీజనల్ పండ్లు సరఫరా చేయాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఆదేశించారు. ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన టెండర్లను ఆయన పరిశీలించారు. 114 మంది టెండర్‌దారులు పాల్గొనగా తక్కువ కోట్ చేసిన వారికి అప్పగించినట్లు తెలిపారు. అనంతరం పీఓ మాట్లాడుతూ.. నాణ్యమైన సరుకులు సరఫరా చేయని పక్షంలో ఏజెన్సీదారులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ విషయంలో జీసీసీ అధికారులు నిత్యం పర్యవేక్షించాలని పీఓ సూచించారు.

పట్టుదలతో చదివితే విజయాలు

విద్యార్థులు ఏకాగ్రత, పట్టుదలతో చదివితే విజయాలు సొంతం కావడంతో పాటు ఇతరులకు మార్గదర్శకంగా నిలవొచ్చని ఐటీడీఏ పీఓ రాహుల్ తెలిపారు. ఇల్లెందు మండలం పోలంపల్లికి చెందిన ధరావత్ రవికుమార్ ఐఐటీ ముంబైలో సీటు సాధించగా, పీఓ ఆయనకు ల్యాప్‌టాప్ అందించారు. అలాగే, ఇతర ఐఐటీల్లో ఎమ్మెస్సీ సీట్లు సాధించిన సుజాతనగర్ మండలం ఉప్పరిగూడెనకు చెందిన లిఖిత, కూసుమంచి మండలం కోకియాతండాకు చెందిన బానోత్ శ్రావణి, దుమ్ముగూడెం మండలం బండిరేవుకు చెందిన సోయం వాసవిని పీఓ అభినందించారు. ఈకార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, గురుకులాల ఆర్‌సీఓ వెంకటేశ్వరరాజు, జీసీసీ డీఎం దావీదు, అధికారులు కృష్ణార్జున, నరేందర్, ప్రమీల, వరలక్ష్మి, చంటి, గణేశ్, శ్రీనివాస్, లిఖిత్, కె.మానస, బి.హరీష్, డాక్టర్ డి.శ్రావణి తదితరులు పాల్గొన్నారు. కాగా, ఇటీవల బాధ్యతలు స్వీకరించిన పీఓ రాహుల్‌ను ఖమ్మం, భద్రాచలం డీడీలు విజయలక్ష్మి, మణెమ్మ, భద్రాచలం ఆర్డీఓ దామోదర్‌రావు, జీసీసీ డీఎం దావీదు, భద్రాచలం తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్‌సీఓ వెంకటేశ్వరరాజు, అధికారులు సన్మానించారు.

ఉపాధి పనుల్లో అక్రమాలపై చర్యలు



మాట్లాడుతున్న అధికారులు

గుండాల: ఆళ్లపల్లి మండలంలోని గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో చాలా అక్రమాలు, అవినీతి జరిగిందని, దీనికి సంబంధించి రికవరీ చేసి షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని, అవసరమైతే సస్పెండ్ చేస్తామని డీఆర్‌డీఓ రవి అన్నారు. మండల కేంద్రంలో 2023 మార్చి నుంచి ఈ ఏడాది మార్చి వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. ఎంపీపీ కొండ్రు మంజుభార్గవి, జెడ్పీటీసీ హనుమంతరావు అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించగా రవి మాట్లాడారు. ఆళ్లపల్లి మండలంలో ప్రతీ పనిలో అవినీతి జరిగిందని, చాలా వరకు డబ్బులు రికవరీ చేయాల్సి ఉందన్నారు. ఓపెన్ ఫోరం ఆలస్యమైనందున సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. నివేదికలు ఇవ్వని ఆర్‌అండ్‌బీ, పీఆర్, అటవీ శాఖ అధికారులపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సామాజిక తనిఖీ అధికారి అనూష, విజిలెన్స్ వింగ్ అధికారి రమణ, జూనియర్ క్వాలిటీ అధికారి అనిల్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసరావు, రేసు ఎల్లయ్య, రతీశ్ పాల్గొన్నారు.